క్లుప్తంగా

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి..



హెల్త్ రిపోర్టులు అందజేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. నగర పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయిలో పోటీలు బుధవారం స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహిచారు. అలాగే స్థానిక అగురువీధి సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి, పలువురికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కేవీ కృష్ణారావు, కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఎంపీడీఓ జి. రామారావు, ఈఓపీఆర్‌డీ కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం అర్బన్: నగరంలోని వివిధ కూడళ్లలో ఉన్న అనాథలకు నేతాజీ మాజీ సైనికుల సంక్షేమ సంఘ జిల్లా కమిటీ సభ్యులు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోట జంక్షన్ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో చలితో ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లు అందజేశారు. సంఘ అధ్యక్షుడు పెద్దింటి గుణాకర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఓఎస్ ప్రకాశరావు, బొడ్డేపల్లి జగన్నాథం, బీవీ నారాయణ, వెంకటగుప్త, మహంతి గణపతి, జి.శివకుమార్, విజయ్, పి.మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంఈఓ మూర్తి

నెల్లిమర్ల: దేశంలోనే విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది మన రాష్ట్రమేనని ఎంఈఓలు యూఎస్ఎన్ మూర్తి, విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ ల్యాబ్‌ను బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 500 పాఠశాలలకు మాత్రమే ఈ ల్యాబ్ సౌకర్యం ఉందని తెలిపారు. ఇటువంటి ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనందమూర్తి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల విధానంపై అవగాహన



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు

పూసపాటిరేగ: ప్రతి ఒక్కరూ ఎన్నికల విధానంపై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు ఎ. రాజ్‌కుమార్, బి. పాపినాయుడు అన్నారు. జాతీయ ఎన్నికల దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులకు ఎన్నికల విధానంపై మండల స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సవం

విజయనగరం అర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్ల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విజయనగరం డిపో ఆవరణలో జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. బస్సు కండీషన్‌పై అవగాహన.. డ్రైవింగ్ చేసే సమయంలో ఏకాగ్రత కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో....

ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లోని స్టాఫ్ శిక్షణ కళాశాలలో డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ, వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చపట్టడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న బాసట

- మహిళల ఆర్థిక సాధికారత దిశగా అడుగులు
- వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



మహిళలకు జగనన్న ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీ బెల్లాన , ఎంఎల్‌ఏ బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స, తదితరులు

పూసపాటిరేగ: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక వెంకట సీతారామ డిగ్రీ కళాశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 1575 మహిళా సంఘాలలోని 17,495 సభ్యులకు 12 కోట్ల 33 లక్షల రుపాయల చెక్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతలలో మాఫీ చేశారన్నారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. పేదలకు మేలు జరిగితే చంద్రబాబు ఓర్వలేరని, అందుకే అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇవేమీ ప్రజలు పట్టించుకోరన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రజాబలం ఉందని.. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుతో నియోజకవర్గం అభివృద్ధిపథంలో పయనిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుమారు 440 కోట్ల రూపాయలతో విజయనగరంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన జగనన్నకు జిల్లా వాసులు రుణపడి ఉండాలన్నారు. చంద్రబాబు తన హయాంలో విజయనగరం జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, వెలుగు ఏపీడీ సావిత్రి, ఏసీ రాజ్‌కుమార్, ఏపీఎంలు అరుణ, పెంటంనాయుడు, వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు. ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, చిక్కాల సాంబశివరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, టి.సీతారాం, దాడిశెట్టి త్రినాథరావు, బర్రి చినఅప్పన్న, దేశెట్టి గణేష్ , చాపల సత్తిబాబు, వాసుపల్లి అప్పన్న, ఎడ్ల రామకృష్ణ, సముద్రపు రామారావు, మహంతి లక్ష్మణరావు, రౌతు శ్రీరామ్మూర్తి, బొడ్డు ఎల్లాజీ, దాడిశెట్టి గోవింద, శాంతాటి శ్రీనివాసరావు, పి. సత్యం, తాడిశెట్టి బాబు, కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్‌తో జీవనోపాధి..



బ్యాంక్ నుంచి తీసుకున్న రుణంతో పాన్‌షాపు పెట్టుకున్నాను. జగనన్న వచ్చిన తర్వాత మా పద్మావతి స్వయం సహాయక సంఘానికి రూ.3.60 లక్షల రుణమాఫీ జరిగింది. చెప్పిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ డబ్బులు వేశారు. జగన్ మోహన్‌రెడ్డి ఇంటికి పెద్ద కొడుకులా వ్యవహరిస్తున్నాడు.

– కానూరి లక్ష్మి, శాలిపేట, పూసపాటిరేగ

పిల్లలను చదివించుకుంటున్నాను..



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేసిన అమ్మ ఒడితో మా పిల్లలను చదివించుకుంటున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నారు. డిజిటల్ క్లాసులు, బైజూస్ ట్యాబ్‌లు అందజేయడం గొప్ప విషయం. జగనన్నను జీవితాంతం గుర్తుంచుకుంటాం.

– చుక్క జ్యోతి, లబ్ధిదారు, కుమిలి.

నెరవేరిన సొంతింటి కల..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయి. గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్లలేని నిరుపేదలకు సొంత గూడు కల్పించారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాయి. వైఎస్సార్ ఆసరాతో నా కుటుంబం ఎంతో లబ్ధి పొందింది.

– లత, లబ్ధిదారు, రెల్లివలస



సమావేశానికి హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 3వ డివిజన్ 3వ నంబర్ సచివాలయ పరిధిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం శ్రావణి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ప్రతి డివిజన్‌కు 20 లక్షల రూపాయల నిధులు ప్రత్యేకంగా మంజూరు చేస్తుండడంతో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సారథ్యంలో నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరుగుతోందన్నారు. రహదారుల విస్తరణతో పాటు ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించినట్టితే నగరం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు ఎస్‌వీవీ రాజేష్, ముచ్చు శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఎంపీపీ అప్పలనాయుడు



విజయనగరం రూరల్: ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ఉపాధ్యాయులు

విజయనగరం రూరల్: ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మలిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఎంపీపీ అప్పలనాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు ఒకటో తరగతి నుంచే అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే సత్సంకల్పంతో ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకువచ్చారన్నారు. అలాగే పైతరగతులకు చేరుకోగానే మరింత నాణ్యమైన విద్యను అందించడానికి బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు బడి మధ్యలో మానేయకుండా అమ్మఒడి, జగనన్న విద్యా కానుకలను అందిస్తున్నారన్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన వంటి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. 'నాడు–నేడు' పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొసర నిర్మల, మలిచర్ల, సుంకరిపేట సర్పంచ్‌లు టి.రమాకుమారి, ఎస్.రాజేశ్వరి, ఎంఈఓ పీబీవీ రామచంద్రరాజు, హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

భోగాపురం: ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవాలని సర్పంచ్ కర్రోతు వెంకటరమణ అన్నారు. మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఇందిరాదేవి అధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రమణ, పతివాడ రామకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించాలి

విజయనగరం ఫోర్ట్: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ముప్పల లక్ష్మణరావు తెలిపారు. వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్, డైరీని ఆయన బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.ప్రసాదరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

విజయనగరం ఫోర్ట్:

అపరిచిత వ్యక్తుల పట్ల ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆడపిల్లలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. విద్యతో పాటు నైతిక విలువలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, జిల్లా స్త్రీ, సంక్షేమ సాధికారిత అధికారి బి. శాంతకుమారి, డీసీపీయూ యాళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లు తగవు..

- డాక్టర్ తేజస్విని



అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

పూసపాటిరేగ: యువత చెడుఅలవాట్లకు బానిసై మానసిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, మత్తుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిని తేజస్విని అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసైతే నిద్రపట్టకపోవడం, చిరాకు వంటి లక్షణాలతో పాటు ఒక్కోసారి ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రమీలాదేవి, సైకాలజిస్టులు రాజు, మంగమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి

- మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: రాష్ట్రంలోని మిగిలిన కార్పొరేషన్‌లకు దీటుగా విజయనగరం నగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో పొందుపరిచిన 19 అంశాలపై కమిటీ సభ్యులు చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టేలా అధికారులను ఆదేశించామన్నారు. ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో నగరంలోని రహదారులను అభివృద్ధి చేస్తూ, ప్రధాన జంక్షన్‌లను సైతం ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

నగర అభివృద్ధికి అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆకాంక్షించారు. పలువురు అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లకుండా కార్యాలయానికి పరిమితం అవుతున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యం

- నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు
- నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ప్రారంభం



విజయనగరం: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



విజయనగరం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మేయర్, ఎంపీపీలు



నెల్లిమర్ల రూరల్: జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన అలుగోలు క్రీడాకారులు

విజయనగరం: క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించి ఆరోగ్యకరమైన సమాజ స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం వేదికగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో నియోజకవర్గ స్థాయి పోటీలను బుధవారం ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఈ నెల 30 వరకు పోటీలు జరుగుతాయని, విజేతలకు క్రీడాంశాల వారీగా రూ.35,000, రూ.15,000, రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ క్రీడలో విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి రూ.20,000, రూ.10,000, రూ.5,000 చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరగనున్న జిల్లాస్థాయి పోటీల్లో తలపడాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, క్రీడా రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుత్‌కుమార్, పలువురు కార్పొరేటర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అలుగోలు క్రీడాకారుల సత్తా..

నెల్లిమర్ల రూరల్: నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. బుధవారం మండల కేంద్రంలోని జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు చెందిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీల్లో అలుగోలు గ్రామం తరపున పాల్గొన్న క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పీఈటీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు, తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు అభినందనలు



జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన తైక్వాండో సబ్ జూనియర్ ఖేలో ఇండియా క్యాడెట్ ఎంపిక పోటీల్లో అర్హత సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం అభినందించారు. ఈ నెల 21న కర్నూలు జిల్లా నంద్యాలలో 37వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీలతో పాటు, ఖేలో ఇండియా క్యాడెట్ విభాగాలలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో గెలుపొందిన క్రీడాకారులు ఫిబ్రవరి 2 నుంచి రాయపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఖేలో ఇండియా ఉమెన్ విభాగంలో గెలుపొందిన క్రీడాకారులు ఏడో తేదీ నుంచి పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో తలపడతారు. ఎంపికై న క్రీడాకారులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కోలగట్ల తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు



డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత

విజయనగరం అర్బన్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, నగరంలోని అయోధ్య మైదానం, గురజాడ కళాశారతిలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలు ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. అయోధ్య మైదానం వద్ద పాఠశాల విద్యార్థులతో మానవహారం, నేను ఓటు వేస్తాను అనే అకృతిలో విద్యార్థుల ప్రదర్శన, ఓటర్ల దినోత్సవ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కలిగిస్తూ రూపొందించిన శకటం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అనంతరం గురజాడ కళాభారతి వరకు పులివేషాలు, బుట్టబొమ్మలు, కర్రసాము, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక బృందాలతో ప్రదర్శనలుంటాయన్నారు. ఉదయం 10.30 గంటలకు గురజాడ కళాభారతిలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి అవార్డులు, ప్రశంసాపత్రాల బహూకరణ, అతిథుల సందేశాలు ఉంటాయన్నారు.